ప్రజాశక్తి





సోమవారం 15 ఏప్రిల్ 2024 8 పేజీలు

కర్నూలు నంద్యాల

మంత్రాలయంలో

త్రిముఖ పోటీ..?

- ఇప్పటికే బరిలో వైసిపి, టిడిపి
- పోటీకి సిద్ధమంటున్న తిక్కారెడ్డి



బాలనాగిరెడ్డి (వైసిపి)



ఎన్.రాఘవేంద్ర రెడ్డి (టిడిపి)



ప్యాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వైసిపి, టిడిపి బరిలో ఉండగా టిడిపి తరపున టికెట్ ఆశించి భంగపడిన పాలకుర్తి తిక్కారెడ్డి కూడా పోటీకి సిద్ధం అంటున్నారు...

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇప్పటికే వైసిపి, టిడిపి కూటమి అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులను ప్రకటించాయి. రెండు పార్లమెంట్, మూడు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ కూడా అభ్యర్థులను ప్రకటించింది. రాఘవేంద్రుడి సన్నిధి ఉన్న మంత్రాలయంలో రాజకీయ రోజు రోజుకూ రసవత్తరంగా మారుతోంది. ఓటర్ల తుది జాబితా ప్రకారం మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 2,05,429 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,00,732 మంది పురుష ఓటర్లు ఉండగా 1,04,677 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 20 మంది ఉన్నారు. ఆ నియోజకవర్గంలో వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి టికెట్ ఖరారు చేశారు. టిడిపి కూటమి తరపున టిడిపి అభ్యర్థిగా ఎన్.రాఘవేంద్రరెడ్డి పేరును ఖరారు చేశారు. బాలనాగిరెడ్డి ఇప్పటికే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో టిడిపి నుంచి, 2014, 2019 నుంచి వైసిపి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాఘవేంద్రారెడ్డి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో టిడిపి అధిష్టానం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జిగా ఉన్న పాలకుర్తి తిక్కారెడ్డిని కాదని రాఘవేంద్రారెడ్డికి టికెట్ ఖరారు చేశారు. రాఘవేంద్రరెడ్డి తండ్రి మాధవరం రామిరెడ్డి ఎంపిపిగా, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా పని చేశారు. రాఘవేంద్రరెడ్డికి టికెట్ కేటాయించి నప్పటి నుంచి తిక్కారెడ్డి అసంతృప్తితో ఉన్నారు. ఆయన అనుచరుల్లోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. టిడిపి తరపున తిక్కారెడ్డికే టికెట్ కేటాయించాలని నియోజక వర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తిక్కారెడ్డికి టికెట్ ఇవ్వకుంటే టిడిపికి సహకరించేది లేదని తేల్చి చెప్పారు. ఈ అంశంపై తిక్కారెడ్డి ఇప్పటికే నియోజక వర్గంలోని ముఖ్య నేతలు, ఆయన అనుచరులతో సమావేశాలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా తాను పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తొలుత కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలని ఆయన భావించినా స్వతంత్రంగా పోటీ చేసే మరింత బాగుంటుందని ఆయన అనుచరులు ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో స్వతంత్రంగా పోటీ చేసేందుకు తిక్కారెడ్డి సిద్ధమవుతున్నారు. ఆయనకు కొంత మేర మంచి ఓటు బ్యాంకే ఉండటంతో ప్రధాన పార్టీల నాయకులకు గట్టి పోటీ ఇవ్వనున్నారు. దీంతో నియోజకవర్గంలో వైసిపి, టిడిపితో పాటు తిక్కారెడ్డి మధ్య త్రిముఖ పోరు నెలకొన నుంది. మరో వైపు ఆ నియోజక వర్గానికి సంబంధించి కాంగ్రెస్ ఇప్పటి వరకూ అభ్యర్థిని ప్రకటించలేదు. ఆ స్థానం నుంచి కాంగ్రెస్, పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయనున్నారు. ప్రధాన పోటీ మాత్రం ముగ్గురు అభ్యర్థుల మధ్య సాగనుంది.

ఘనంగా అంబేద్కర్ జయంతి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/నంద్యాల కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్నూలు పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పూలు మాల వేసి నివాళులర్పించారు. నవ భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని పేర్కొన్నారు. పలు రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాల కు చెందిన నాయకులు కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచానికే ఆదర్శనీయమైన రాజ్యాంగాన్ని రచించిన ఆయన అపార మేధావి, విద్యావంతులని కొనియాడారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడి రంగలక్ష్మీదేవి మిగతా 3లో



కర్నూలు నగరంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న కలెక్టర్ సృజన



నంద్యాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యాలయాలు

విజ్ఞాన కేంద్రాలుగా మారాలి

- విద్యార్థి, యువజన చైతన్యానికి కృషి చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్



డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయాలు కార్యకర్తలను తయారు చేసే విజ్ఞాన కేంద్రాలుగా ఉండాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ సూచించారు. ఆదివారం కార్మిక కర్షక భవన ప్రాంగణంలో నిర్మించిన ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయాలను ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాన్ని ఎంఏ.గఫూర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయాన్ని సెయింట్ జోసఫ్ విద్యాసంస్థల అధినేత శౌరీల్ రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ. గఫూర్ ప్రారంభిం చారు. అనంతరం ఏర్పాటుచేసిన సభకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.అబ్దుల్లా, వై.నగేష్, అధ్యక్షత వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాలను వేసి జోహార్లు అర్పించారు. ఎంఏ.గఫూర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో విద్యార్థి యువజన సంఘాల కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం సంతోష కరమన్నారు. నేటి నుండి విద్యార్థి, యువజన సంఘాల కార్యాలయాలు కార్యకర్తలతో నాయకులతో కళకలాడాలన్నారు. పాఠశాలల్లో, కళాశాలలో, హాస్టల్లో కమిటీలు ఏర్పాటు చేసి సమస్యల కోసం పోరాడినప్పుడే విద్యార్థి సంఘాల నాయకులకు గుర్తింపు లభిస్తుంది అన్నారు. చదువులో కూడా ముందుండాలని అప్పుడే గౌరవం పెరుగుతుందని చెప్పారు. సమ స్యలపై స్పందించి విద్యార్థులకు స్ఫూర్తి దాయ కంగా ఉండాలన్నారు. అంబేద్కర్‌ను, భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని, నిత్యం అధ్యయనం, పోరాటం చేస్తూ ఉండాలని సూచించారు. రాయలసీమ ప్రాంతంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, జిల్లా సమగ్ర అభివృద్ధికి విద్యార్థి యువజన సంఘాలు మిగతా 3లో



అంబేద్కర్‌కు ఐద్వానేతల నివాళి

మహిళా హక్కుల ప్రధాత అంబేద్కర్‌కు నీరాజనం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజకీయ అవకాశం కోసం ఉన్న పార్టీలను వదిలి, మరో పార్టీలో చేరి పదవులు పొందే రాజకీయ నాయకులే మనకు కనపడతారని, కానీ మహిళల హక్కుల కోసం మంత్రి పదవినే తృణప్రాయంగా వదిలిన గొప్ప ఆదర్శనేత అంబేద్కర్ అని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. అరుణమ్మ, ఎన్.అలివేలు కొనియాడారు. ఆదివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహానికి ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. అరుణమ్మ, ఎన్ అలివేలు, జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ సుజాత, నాయకులు పర్విన్‌లు పూలమాలవేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలను వంటింటి కుందేల్లు గా మార్చాలని చూసే బిజెపిని, దానికి వంత పాడిన వైసిపిని కలిసి పెనవేసుకున్న టిడిపిని ఈ ఎన్నికల్లో ఓడించాలని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో మహిళల హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



అంబేద్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న ఇంతియాజ్

వైసిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ కు నివాళి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని శ్రీకృష్ణ కాలనీ, అశోక్ నగర్ నందు 46వ వార్డు కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కర్నూలు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎఎండి.ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ వైసిపి అభ్యర్థి బివై రామయ్య, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ విజయ మనోహరి హాజరయ్యారు. ఈసందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



డాక్టర్ ఇస్మాయిల్ కు ఇంతియాజ్ నివాళి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి కర్నూలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న డాక్టర్ ఇస్మాయేల్ 4వ వర్ధంతి సందర్భంగా కర్నూలు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఇస్మాయిల్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. ఆదివారం ఆయన సమాధి వద్ద ఆయనను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు నీరాజనాలు పలికారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం: కెవిపిఎస్ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో కెవిపిఎస్ వార్డు కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని శ్రీ చైతన్య స్కూల్ దగ్గర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు అధ్యక్షులు జి.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. కెవిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరయ్య బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు..ఈశ్వరయ్య, కెవిపిఎస్ నగర గౌరవ అధ్యక్షులు ఆర్.నరసింహులు, వార్డ్ కార్యదర్శి వై.జాన్సన్ లు మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతికి వచ్చిన అందరికీ జై భీములు తెలిపారు. భారతదేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మేలు చేస్తామని అధికారం చేపట్టి ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి ఆర్ఎస్ఎస్ అజెండాను, మనువాద సిద్ధాంతాన్ని అమలుచేస్తుందన్నారు. .పాతకాలపు మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని ప్రణాళికను సిద్ధం చేసుకున్నదని, 2024 ఎన్నికలలో మరోసారి అధికారం చేపట్టిభారత రాజ్యాంగాన్ని మార్చివేస్తామని బహిరంగం గానే ప్రకటిస్తున్న దన్నారు.. భరతమాత బిడ్డలమని చెప్పుకునే టిడిపి, వైసిపి, బిజెపి పార్టీలు మణిపూర్ లో భారత మాత బిడ్డలను నడివీధుల్లో బట్టలు ఊడదీసి నగ్నంగా ఊరేగిస్తూ నరికి చంపేసి కాల్చి వేస్తుంటే ఈ పార్టీలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశించారు.



మాట్లాడుతున్న నరసింహులు

వీరికి నోరు లేదా మాట్లాడలేరా కళ్ళు కనపడడం లేదా , భరతమాత బిడ్డలం అని చెప్పుకునే అర్హత ఉందా ఆలోచించాలన్నారు. అందుకనే భారత రాజ్యాంగ నిర్మాత ఓటు హక్కుని ఒక వజ్రాయుధంగా మనకు అందజేశారు.ఈవజ్రాయుధం తో ఈ ప్రభుత్వాలని గద్దె దింపుతామని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామనే హెచ్చరిక ఈ ప్రభుత్వాలకు చేయవలసిన అవసరం ఉందన్నారు.

కర్నూలు క్రైమ్: కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ నందు బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లోకర్నూలు మండల మాజీ ఎంపిపి ధర్మవరం వాసు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి నెహేమియా ,ఎక్స్ వైస్ ఎంపిపి వాసు మాజీ ఎంపిటిసి పి చిన్న లక్ష్మన్న వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పంచలింగాల వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్ఆర్ జనరల్ సెక్రెటరీ ప్రసాద్ సర్పంచి యు.విద్యాసాగర్ పాల్గొన్నారు.

సి బెళగల్ : సి బెళగల్ లో బస్టాండ్ ఆవరణంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకంతో పూల మాలతో వేసి ఘనంగా కేక్ ను కట్ చేసి జయంతి చేపట్టారు. ఇందులో అంబేద్కర్ ఆశయ సాధన సమితి అధ్యక్షులు శశిధర్ కుమార్, గౌరవ అధ్యక్షులు వెంకటేష్ పోలసి, జోజి,ఉపాధ్యక్షులు మాదాసి మల్లికార్జున,గౌరవ సలహాదారులు ఎస్ ఎం బాషా, సర్పంచ్ పాండురంగన్న,ప్రధాన కార్యదర్శులు నాగరత్నం, పరమేష్,, దేవన్న, కోశాధికారులు ఈరన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: వెల్దుర్తి పట్టణంలోని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి ముత్యాల శైలజ, జడ్పిటిసి దాది పోగు సుంకన్న, ఎపిఎమ్మార్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దారి పోగు నవీన్, ఏపీ ఎమ్మార్పిఎస్ మాజీ మండల అధ్యక్షుడు గిడ్డయ్య, మాజీ జెడ్పిటిసి ఎమ్మార్పిఎస్ సీనియర్ నాయకులు ఐజయ్య, మాల మహానాడు జిల్లా నాయకులు నూకల శ్రీను, అంజి, వెల్దుర్తి పాత బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పత్తికొండ: పత్తికొండ పట్టణంలోని కెవిపిఎస్ ,చర్మకారుల ,డప్పు కళాకారులు నాయకులు ఆర్‌డిసి బస్టాండ్ నుండి నాలుగు స్తంభాల మీదగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్ అంబేద్కర్ కు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు..

దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రదర్శన

కేక్ కట్టింగ్ ,డైరీ ఆవిష్కరణ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు గోన నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం , దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ 133 వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు , దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు గోన నాగరాజు, దళిత సంఘాల నాయకుడు మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, గౌరవ అధ్యక్షులు బజారన్నల ఆధ్వర్యంలో ఉదయం ఎస్‌సి సంక్షేమ సంఘం, ఐక్య వేదిక కార్యాలయం, ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుండి ఎస్‌సి ఉద్యోగులు, విద్యార్థులతో ర్యాలీ ప్రారంభించారు. నీలం రంగు కండువా ధరించి, అంబేద్కర్ చిత్ర పటాలు చేతపట్టి జై భీమ్ నినాదాలతో, డప్పుల తో అంబేద్కర్ విగ్రహాన్ని చేరుకొని ఆయనకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం 133 వ అంబేద్కర్ జయంతి అంబేద్కర్ చిత్రపటంతో ఉన్న కేక్ ను సంయుక్తంగా సుధాకర్ బాబు, గోన నాగరాజు ఉద్యోగులు విద్యార్థుల సమక్షంలో కట్ చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు .ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం డైరీ-2024 ను విడుదల చేశారు. ఈ సందర్భముగా గోన నాగరాజు మాట్లాడుతూ ప్రపంచంలో పెద్ద పండుగ అంబేద్కర్ జయంతి అని, ఆయన జ్ఞానానికి అంబేద్కర్



కొండారెడ్డి బురుజు నుంచి ప్రదర్శన చేస్తున్న దళిత సంఘాల నేతలు

సంకేతమని, రోజుకు 21 గంటలు విద్యను అభ్యసించడానికి కృషి చేసి 32 డిగ్రీలు పొందిన ఏకైక విజ్ఞాని అంబేద్కర్ అన్నారు, అంబేద్కర్ కుల నిర్మూలనకు ఎంతో కృషి చేశారని, సాంఘిక అసమానతలు తొలగి పోవాలని, ప్రతి మనిషికి ఒకె విలువ వుండాలని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం అందరికి సమంగా వుండాలని అంబేద్కర్ ఆశించారన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ బాటలో నడవాలని పాల్గొన్న విద్యార్థులకు, ఉద్యోగులకు అంబేద్కర్ ఆశయాలకోసం నిరంతరం పని చేయాలని అన్నారు. జిల్లా గౌరవఅధ్యక్షులు,సి.సుంకన్న .ఉపాధ్యక్షుడు , ఆర్.సంజీవ్ కుమార్, కోశాధికారి రామాంజనేయులు, లెక్చరర్ బాల నారాయణ, ఉపాధ్యాయులు, విదార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం ఓల్డ్ కౌన్సిల్ హాలులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన కార్పొరేషన్ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ, అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య , టిపిఆర్ఓ వెంకటలక్ష్మి , మేనేజర్ చిన్నరాముడు , రెవిన్యూ ఆఫీసర్ జునైద్ , సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ , రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ మన్సూర్ , సిబ్బంది పాల్గొన్నారు.



సిపిఎం అంబేద్కర్‌కు ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఎండి.ఆనంద్ బాబు, సి.గురుశేఖర్, టి నరసింహులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదని, గొప్ప రాజనీతిజ్ఞుడు, ఆర్థిక శాస్త్రవేత్త అన్నారు. రాజ్యాంగ రచన కాలంలో 12 దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న ప్రాంతాలు, భిన్న సాంప్రదాయాలు కలగలిసి ఉన్న భారతదేశానికి అనుగుణంగా అతిపెద్ద లిఖిత లౌకిక రాజ్యాంగాన్ని అందించిన ఘనత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కే దక్కుతుందన్నారు. సమాజ హితం కోసం కష్టాల జీవితాన్నే ఇష్టంగా ఎంచుకుని, అసమానమైన వ్యవస్థను సమానం చేసేందుకు అహర్నిశలు కృషి చేశారన్నారు. ఒక్క రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలుపరిస్తే వ్యవస్థ మారి తీరుతుందని, కానీ నేటి పాలకులు రాజ్యాంగానికే తూట్లు పొడుస్తూ.. ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలిగిస్తూ రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందన్నారు. రాష్ట్రంలో ఉన్న పాలక, ప్రతిపక్షాలు మాకు అధికారం తప్ప, ప్రజల హక్కులు పట్టవు అన్నట్లు



కర్నూలులో అంబేద్కర్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న జిల్లా కార్యదర్శిగౌస్ దేశాయ్, తదితరులు

వ్యవహరిస్తున్నాయన్నారు. రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం పనిచేయడమే మనం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. జయంతి కార్యక్రమంలో లక్ష్మి నారాయణ, గురు స్వామి, ఎల్ల గువేరా, మునిస్వామి, గోపాల్, అజయ్, మునీర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

మొదటి పేజీ తరువాయి... తదితరులు పాల్గొన్నారు. కర్నూలు జొహరాపురంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఎండ్ల బండిపై అంబేద్కర్ చిత్రపటంతో వీధివీధినా ఊరేగింపు నిర్వహించారు. కర్నూలులో ఐద్వా ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎఎండి.ఇంతియాజ్ అహ్మద్, నాయకులు నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఎండి.ఆనంద్ బాబు, సి.గురు శేఖర్, టి.నరసింహా నివాళులర్పించారు. ఆలూరులో వైసిపి అభ్యర్థి బి.విరూపాక్షి, ఆదోనిలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి నివాళులర్పించారు. ఎమ్మిగనూరులో కెవిపిఎస్, పలు సంఘాల ఆధ్వర్యంలో నివాళి సభ నిర్వహించారు. కర్నూలు కెకె భవన్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయాల ప్రారంభం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, సెయింట్ జోసఫ్ కళాశాలల ప్రిన్సిపల్ శౌరిల్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పాల్గొన్నారు. నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అంబేద్కర్ 133వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. డిఆర్ఓ ఎ.పద్మజ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి పాల్గొన్నారు. అంబేద్కర్ గొప్ప మహనీయుడని ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఒక వర్గం కోసమే కాకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కషి చేశారన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంతో పాటు కుల నిర్మూలనకు విశేషంగా కృషి చేశారన్నారు. దేశంలో ఓటు హక్కు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. ఇటువంటి గొప్ప ఓటు హక్కును రాబోయే ఎన్నికల్లో అందరూ వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కలెక్టర్ కోరారు. నంద్యాల టిడిపి కార్యాలయంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి. ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నివాళులు అర్పించారు. నంద్యాల పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నీసా నివాళులర్పించారు. కాంగ్రెస్ అభ్యర్థి గోకుల్ కృష్ణారెడ్డి నివాళులర్పించారు. డోన్‌లో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నివాళులర్పించి మాట్లాడారు. నందికొట్కూరులో శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ నివాళులర్పించారు.

జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

రాష్ట్రంలో అన్ని వర్గాలను అణచివేసిన జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కూటమి టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సున్నిపెంటలోని రెడ్ల కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కాపు, తెలగ, బలిజ సంఘాల ఆత్మీయ సమ్మేళనం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా రింగ్ పార్క్ సెంటర్లో అంబేద్కర్ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుండి ఏపీ జెన్కో కాలనీలో తిరిగి అనంతరం రెండో వార్డు రామకృష్ణ లైన్‌లో వైసిపి బూతు కన్వీనర్ దర్శనం రాజు, ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలో చేరారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానం పరిధిలోని అడవిలో రోడ్డు పక్కన కాయలు అమ్ముకుంటూ జీవిస్తుండగా అటవీ శాఖ వారు అడ్డువచ్చి అమ్మకాలను నిలిపివేశారని మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బుడ్డా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం రాగానే తప్పకుండా అటవీశాఖ వారితో మాట్లాడి అటవీ ఉత్పత్తులను అమ్ముకునేలా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ, తెలగ సేవా సమితి పెద్దలు కోనేటి మల్లికార్జున ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సున్నిపెంట కాలనీలో కాపు కులానికి కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కాపులకు కళ్యాణ మండపం స్థలం చూసుకోమని చెప్పామని, ఈ లోపు వైసిపీ ప్రభుత్వం రావడం వలన కళ్యాణ మండపం మరుగున పడినదని, టిడిపి ప్రభుత్వం రాగానే కళ్యాణ మండపానికి స్థలంతో పాటు కొంత నిధులను కూడా కేటాయిస్తానని హామీనిచ్చారు. అలాగే లంబాడి కాలనీలో భీమ్లా నాయక్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, స్థానిక వైసీపీ సీనియర్ నేత ఆసాది ప్రవీణ్ తేజ ఆధ్వర్యంలో 25 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖాతా రామిరెడ్డి, గుండయ్య యాదవ్, రమణ, మీనిగా రమణ, రామసుబ్బారెడ్డి, బిజెపి నాయకులు గెల్లి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి మల్లికార్జున, నల్లబోతుల మల్లికార్జున, జనసేన నాయకులు రౌతు అశోక్,నాగసాయి, కోనేటి మల్లికార్జున, శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి మహిళలు, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

సిఎంపై దాడి పిరికిపందల చర్య : వైసిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై చేసిన దాడి పిరికిపందల చర్య అని వైసిపి సీనియర్ నాయకులు; మాజీ ఎంపీపీ దేశు వెంకట్రామిరెడ్డి; వ్యవసాయ సలహా సంఘం మండల అధ్యక్షుడు భీష్మమల్లారెడ్డి అభివర్ణించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు దత్తపుత్రుడు, బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి ఓ కుట్ర ప్రకారం జగన్ పై అత్యాయత్నానికి పాల్పడేలా ప్రేరేపించారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సిఎం జగన్‌ను ఓడించలేక భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వెన్నుపోటుదారులైన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హత్యా రాజకీయాలు ప్రేరేపించే బిజెపి అధ్యక్షురాలు పురందశ్వరి ఆటలు చెల్లవని, ప్రజలే బలమైన తీర్పును ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో బండి ఆత్మకూరు ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వర్ రెడ్డి, వైసిపి యూత్ ప్రెసిడెంట్ చెదుల్లా దీప్ కాంత్ రెడ్డి, ఎంపిటిసి పుల్లయ్య, వైసిపి నాయకులు నందిపాటి రామచంద్రారెడ్డి, చీకటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వడదెబ్బతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

- మతుడి కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్లలోని సంజీవ నగర్ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వడ్డే నాగశేషులు (53) వడదెబ్బతో మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. వడ్డే నాగశేషులు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శనివారం వడదెబ్బతో తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. వడ్డే నాగశేషులుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న సిఐటియు అనుబంధ భవననిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్కె భాష మిత్ర బృందంతో మతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భార్యకు 5000 రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం బీమా సౌకర్యం షరతులు లేకుండా వర్తింపజేసి, మరణించిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం రషీద్ భాష, మక్బూల్ భాష, వడ్డే వెంకటేశ్వర్లు ,మద్దిలేటి, సెంట్రింగ్ మా భాష, పీర్ భాష వెంకటేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టల వద్ద తనిఖీలు ముమ్మరం

- నిబంధనలను ఉల్లంఘించిన వారిపై 41 కేసులు నమోదు

- 2,489 మంది పై బైండోవర్ కేసులు

- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా, ఫ్లాగ్ మార్చ్

- జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలోని చెక్ పోస్టలలో పోలీస్ అధికారులు, సిబ్బంది రహదారులలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బోర్డర్ చెక్పోస్టలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అక్రమ రవాణాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసి కర్నాటక, తెలంగాణ, ఇతర జిల్లాల నుండి నంద్యాల జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 41 కేసులు నమోదు చేశామన్నారు. సరైన ధృవపత్రాలు చూపించకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.3 కోట్ల 28 లక్షలు నగదును సీజ్ చేశామన్నారు. ఎన్నికల్లో మద్యం పంపిణీ చేసేవారిని, సమాజంలో శాంతికి భంగం కలిగించే 2,489 మంది వ్యక్తులను కేంద్ర ఎన్నికల నిబంధనల ప్రకారం బైండోవర్ చేశారన్నారు. జిల్లాలో ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజ్ఞాన కేంద్రాలుగా మారాలి

మొదటి పేజీ తరువాయి... కృషి చేయాలని పిలుపునిచ్చారు. రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య మాట్లాడుతూ చదువు పోరాటానికి సమాన అవకాశాలు ఇవ్వాలన్నారు. ఉన్నత పదవుల్లో అత్యధికంగా ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ప్రాంతాల్లో పనిచేసిన వాళ్లే ఉన్నారని వారి ద్వారా పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే నవోదయ ఎపి రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు చేరకుండా ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు చేరి చదువుతున్నారంటే ప్రభుత్వం విద్యను ఎంత నిర్లక్ష్యం చేస్తుందో అర్థమవుతుం దన్నారు. లౌకికతత్వానికి ముప్పు ఏర్పడనున్న ఈ తరుణంలో ఓటు హక్కు గల ప్రతి ఒక్కరు డబ్బుకు ఓటును అమ్ముకోవద్దని నిజాయితీగల వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. సెయింట్ జోసెఫ్ కళాశాలల ప్రిన్సిపల్ శౌరిల్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మానవుడు రాణించాలంటే విద్య ముఖ్యమని, నేడు సెల్ఫోన్‌లపై ఉన్న శ్రద్ధ విద్యపై లేదని చెప్పారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పక ఉండాలన్నారు. ప్రశ్నించే కమ్యూనిస్టుల వాయిస్ లేకపోవడం వల్లే దేశంలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నయన్నారు. విద్యార్థి దశ నుండే పిల్లలకు ప్రశ్నించే తత్వాన్ని సభ్యతను నేర్పాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జిల్లా కార్యాలయాలు నిర్మించుకోవడం అంటే సొంత ఇంటికి వచ్చినంత సంతోషంగా ఉందని తెలిపారు. అధ్యాయనం పోరాటం ప్రశ్నించే విధంగా కార్యాలయాలను తీర్చిదిద్దాలన్నారు. నేటి పాఠ్యాంశాలలో విషాన్ని పోసి పోషిస్తున్నారని, విద్యార్థులలో మంచిని పెంచేందుకు ఉద్యమాల్లో పనిచేయాలని చెప్పారు. వెనుకబడిన కర్నూలు లాంటి జిల్లాల్లో వలసలు ఎక్కువయ్యాయని, అలాంటి ప్రాంతంలో చదువును ప్రోత్సహించాలని, సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఉపయోగపడాలన్నారు. డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో విద్యార్థి యువజన సంఘాలు ఎలా పనిచేయాలో తెలిపారు. భావి భారత పౌరులు గా తీర్చిదిద్దేందుకు జిల్లా కార్యాలయాలు అధ్యయన కేంద్రాలుగా మారాలని అన్నారు. నాయకుల జయంతులు వర్ధంతులు నిర్వహిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తులసి చందు లాంటివారు ప్రభుత్వ విధానాలను ఎండ కడుతున్నారని తెలిపారు. డి వైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ 137వ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాబోయే ఎన్నికల్లో ఆయుధంగా చేసుకొని మోడీ ప్రభుత్వానికి గద్దెదించే విధంగా కృషి చేయాలి అన్నారు. జాతీయ సమైక్యత కోసం కృషి చేసిన మహాత్మా గాంధీ లాంటి వారిని పొట్టన పెట్టుకున్న గాడ్సేను గురించి విద్యార్థులకు యువజనలకు తెలియ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువతరాన్ని మత్తు నాశనం చేస్తుందని, విద్య ద్వారానే సమాజాన్ని మార్చవచ్చన్నారు. హిందూ ముస్లింలు ఐక్యంగా పోరాడి బ్రిటిష్ వారిని తరిమికొట్టిన చరిత్ర భారతదేశానికి ఉందన్నారు. అనంతరం ఒక ఆర్టిస్ట్ చిన్న కూతురు ఉత్తమ మార్కులను సాధించిన రేణువిజయను ముఖ్య అతిథుల చేతుల మీదుగా శాలువాతో సత్కరించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, రంగప్ప, అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌సాయి ఉదయ్, డివైఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు ధనుష్ హుస్సేన్ భాష. మాజీ ఎస్ఎఫ్ఐ ,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య



ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన రేణు విజయను సన్మానిస్తున్న శౌరిలురెడ్డి, పుల్లయ్య, గౌస్‌దేశాయ్ తదితరులు

మహారాజశ్రీ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

క్రెడిటర్ I.P.35/2022

తలారి రామనాయుడు,
S/o పెద్ద రామన్న,
ఉయ్యాలవాడ గ్రామం & మండలం,
నంద్యాల జిల్లా. ...పిటిషనర్

V/S

1) గగ్గెర. రాం మోహన్,
S/o. లక్ష్మన్న,
R/o. ఉయ్యాలవాడ గ్రామం & మండలం,
నంద్యాల జిల్లా
2) కుమ్మం. గంగయ్య,
S/o. లక్ష్మీనారాయణ,
R/o. ఉయ్యాలవాడ గ్రామం & మండలం,
నంద్యాల జిల్లా.
3) పల్లె. శ్రీనివాసరెడ్డి,
S/o. వెంకటరామిరెడ్డి,
R/o. సుద్దమల్ల గ్రామం,
ఉయ్యాలవాడ మండలం,
నంద్యాల జిల్లా. ...రెస్పాండెంట్స్

పై క్రెడిటర్ I.P. పిటిషన్ లో R1 కు నోటీసులు అందచేయకోరి

పై నెంబరు గల అమలు ఆర్జీలో (R1) 1 వ రెస్పాండెంట్ అయిన గగ్గెర. రాంమోహన్ గారి నోటీసులు అందనందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడం ఏమనగా పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 26-04-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు కావలయునని తీర్మానించినారు. అట్లు కానీయెడల పై అమలు అర్జీని నీ పరోక్షమున తీర్మానించబడును

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 26-04-2024

ఇట్లు
పత్తి సుబ్బారామిరెడ్డి,
పిటిషనర్ తరపు న్యాయవాది,
ఆళ్లగడ్డ

ఘనగా అంబేద్కర్ జయంతి

- ప్రజా సంఘాలు, వైసిపి, టిడిపి, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళ్లులు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి బుగ్గన తదితరులు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎన్ఎండి ఫరూక్, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు



పాములపాడు : అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తదితరులు


ప్రజాశక్తి - ఆత్మకూర్

దేశంలో కుల దోపిడీకి వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని, ఆయన ఆశ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై ఉద్యమించాలని కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వి ఏసురత్నం, జిల్లా నాయకులు పి భాస్కర్, ఎన్ సంపత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, బేగరీల సంఘం నాయకులు పి శేఖర్‌తలు అన్నారు. ఆదివారం అంబేద్కర్ 113వ జయంతి సందర్భంగా స్థానిక సుదర్శన వర్మ స్మారక భవనంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో భాస్కర్ అధ్యక్షతన పాత బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరన్న, మా బాషా, బేగరీల సంఘం నాయకులు జయన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు సాయి ప్రసాద్, పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ బాలాజీ రావు తదితరులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే ఎమ్మార్పీఎస్ రాబిన్ సన్ రాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగన్న, గిరిజన సంఘం నాయకులు జవహర్ నాయక్, కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు యేసు రత్నం, నక్క స్వాములు తదితరులు నివాళ్లులర్పించారు. **కొత్తపల్లి** మండలంలోని సింగరాజు పల్లి గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి కెవిపిఎస్ జిల్లా నాయకులు నక్క సంపత్, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి నక్క స్వాములు, గుమ్మడాపురం సర్పంచ్ నక్క విజయకుమార్‌లు నివాళులర్పించారు. అలాగే ముసలమడుగు గ్రామంలో దళిత కాలనీ యువకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. **డోన్** పోలీసుస్టేషన్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శులు బివై.సుబ్బరాయుడు నివాళు లర్పించారు. సంజీవరెడ్డి, బాలరంగారెడ్డి, కలాం, ప్రసాద్, కృష్ణా నాయక్, మధు, శంకరయ్య, అంజనప్ప, జగన్నాథ రెడ్డి, రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** సిపిఎం మండల కార్యదర్శి సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావులు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆనంద్ గౌడ్, బ్రహ్మయ్య చారి పాల్గొన్నారు. **పాణ్యం**లోని ఎంపిడిఒ ఆఫీస్ ఆవరణంలో అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి బత్తిని ప్రతాప్, సీఐటీయూ మండలం నాయకుడు భాస్కర్, మాలమహానాడు జిల్లా నాయకుడు దేవాదత్తు, ఎఐఎఫ్‌బి జిల్లా నాయకుడు వనము వెంకటాద్రి, కాలనీ నాయకుడు చిరంజీవిలు నివాళ్లులర్పించారు.

నంద్యాల కలెక్టరేట్ : టిడిపి కార్యాలయంలో : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సంస్కరణలకు ఆద్యుడని నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలు కొనియాడారు. నంద్యాలలోని టిడిపి పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు. **ఎమ్మెల్యే ఆధ్వర్యంలో :** నంద్యాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్మన్ మాబునిసా, వైస్ చైర్మెన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డిలు నివాళులర్పించారు. కౌన్సిలర్ చంద్రశేఖర్, 1వ పట్టణ అధ్యక్షుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం, దేశం సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్స్ అనిల్ అమృత రాజ్ తదితరులు పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో :** నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రంలో అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి గోకుల్ కృష్ణారెడ్డి నివాళులు అర్పించారు. నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. **డోన్ :** డోన్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు సట్టి.రాజశేఖర్, వైసిపి సీనియర్ నాయకులు అడ్వకేట్ కురిమెట్ల నారాయణ, కౌన్సిలర్‌లు దినేష్ గౌడ్, నాగేంద్ర, శరత్, మల్లికార్జున రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు భాస్కర్, జాన్సన్, ఆదాం, దిలీప్, శ్యామ్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ధార సుధీర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, యువ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి, ఎంపీపీ మురళి కృష్ణారెడ్డిలు నివాళులు అర్పించారు. **పాములపాడు :** పాములపాడులో వైసిపి రాష్ట్ర యువజన అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. వైసీపీ మండల అధ్యక్షులు జి రామలింగేశ్వర రెడ్డి, నాయకులు విజయ్ సింహ రెడ్డి, చౌడయ్య, టి.నాగరాజు, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాదరావు, వెంకటేశ్వర రెడ్డి, ఉపేంద్ర జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో టిడిపి నాయకులు మద్దిలేటి గౌడ్, కుమ్మరి గోవిందు, షమీన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని అవుకు మెట్ట వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాళులర్పించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, మాల మహానాడు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. టిడిపి కొలిమిగుండ్ల మండల అధ్యక్షులు మూలే రామేశ్వర రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంధం హుస్సేని,నాయకులు ఇల్లూరు కొత్తపేట బాలుడు, యాగంటి పల్లె సుధాకర్, పసుపల రమేష్ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు మాండ్ర లింగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ టి సుధాకర్ రెడ్డి, మాల మహనాడు తాలుకా అధ్యక్షుడు శివప్రసాద్‌లు నివాళ్లులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, ఎక్కల దేవి చంద్రమౌళి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అశోక్ రత్నం తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని ఏ కోడూరు గ్రామంలో సర్పంచ్ మన్నే జ్ఞానాభరణం, అంబేద్కర్‌వాది మన్నే కుమార్, మాజీ సైనికుడు నాగరాజ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ దినచర్య అమ్మ రమాబాయి జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే బండి ఆత్మకూర్‌లో వ్యకాసం ఆధ్వర్యంలో సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య అంబేద్కర్ జయంతి నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు రామచంద్రుడు, యువసేన సంఘం కార్యదర్శి డేవిడ్, అధ్యక్షుడు సుబ్బరాయుడు, సిఐటియు నాయకుడు రాజు, వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వెంకటసుబ్బన్న తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు** మండలంలోని చింతలపల్లి గ్రామంలో సర్పంచ్ రమణమ్మ, మాజీ గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డిలు అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. పాల్గొన్నారు. **నంద్యాల**లోని పాత టెలిఫోన్ ఆఫీసు ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహానికి ఆల్ ఇండియా బియస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగ సమాఖ్య నాయకులు అబ్దుల్ సమద్, దేవ ప్రసాద్, సబ్ డివిజనల్ అధికారులు బాల సుబ్రహ్మణ్యం , బాల నాగయ్య తదితరులు నివాళు లర్పించారు. **రుద్రవరం**లోని అమ్మవారి శాల 4 రోడ్ల సెంటర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి మాల మహాసేన మండల అధ్యక్షులు గాలిపోతుల వెంకటేశ్వర్లు, తాలూకా అధ్యక్షులు గుర్రం ప్రభాకర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సర్పంచ్ బైరి విజయలక్ష్మి, బైరి బ్రహ్మం, ప్రజాసంఘాల నాయకులు నరసింహులు, టైలర్ గుర్రప్ప, చంటి ఓబయ్య, లాజరస్, స్వామి దాసు, శౌరి పాల్గొన్నారు. **గడివేముల**లోని భారత్ గ్యాస్ ఆఫీస్ ఆవరణంలో కదిరి కోట రవి కిరణ్ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. **చాగలమర్రి**లోని శివాలయం కాలనీలో సిమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు, టిడిపి జిల్లా పర్సన్ సల్లా నాగరాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. **సంజామల**లో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. నాగేశ్వరావు మాదిగ, కమ్మగిరి మాదిగ, రాముడు మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** బనగానపల్లె ప్రాంతీయ ఏపీటీఎఫ్ కార్యాలయంలో, మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి ఎం నాగరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. మాధవస్వామి, నాయకులు పాల్గొంటున్నారు. **బేతంచర్ల**లో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, వ్యకాసం జిల్లా నాయకులు ఆర్.ఈశ్వరయ్య, వైసిపి యువ నాయకులు బుగ్గన అర్జున్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం, పలు ప్రజాసంఘాల నాయకులు బేతంచెర్లలోని శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గూని నాగేశ్వరరావు ,చంద్రశేఖర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాతే మాజీ జడ్పిటిసి, టిడిపి పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, దళిత సంఘం నాయకులు మేకల నాగరాజు, మంచినీళ్ల సుమంత్, నంద్యాల మధు తదితరులు నివాళు లర్పించారు. **నంద్యాల రూరల్ :** ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు. జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, జిల్లా నాయకులు పాల్గొన్నారు. అలాగే నంద్యాల పట్టణంలోని ఐయుఎంఎల్‌పి కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఇంచార్జ్ మౌలానాఅబ్దుల్ సలాం అంబేద్కర్ జయంతి నిర్వహించారు. **నందికొట్కూరు టౌన్ :** జూపాడు బంగ్లా మండలం పారుమంచాల గ్రామంలోని సచివాలయంలో గ్రామ కార్యదర్శి విజయ్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాధవరం ప్రకాశం ముఖ్య అతిథులుగా హాజరై ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా 133వ జయంతి వేడుకలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది లింగయ్య, సబితుల్లా, సికామని, రైతు సంఘం నాయకులు టీ. రసూల్, అనకలి పెద్దన్న, వార్డు నెంబర్ నాగన్న, చిన్న జా ఫర్నియా, రామ చంద్రుడు, నడిపి మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న యుటిఎఫ్ నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి



ఆత్మకూరు : మాట్లాడుతున్న యేసురత్నం



బేతంచెర్ల: మాట్లాడుతున్న నాయకులు



బండి ఆత్మకూరు మండలంలో..



నందికొట్కూరు టౌన్ : మాధవరంలో..



పగిడ్యాలలో..అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పిస్తున్న టిడిపి నాయకులు



డోన్ : అంబేద్కర్ చిత్రపటానికి నివాళు అర్పిస్తున్న నాయకులు

సిఎం జగన్‌పై దాడి అమానుషం : వైసిపి


విలేకరులతో మాట్లాడుతున్న బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై దాడి అమానుషం అని వైసిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. సిఎం జగన్‌పై రాళ్ళ దాడిని నిరసిస్తూ ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో వైస్సార్సీపీ శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ సిఎంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధ్యులను త్వరి తగతన గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బస్సు యాత్రకు వస్తున్న అపూర్వ స్పందన చూసి ప్రతిపక్షాలు కుట్రపూరితంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై దాడి చేసినట్లుగా భావిస్తున్నామని ఆమె వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బుట్టా శివ నీలకంఠ, రాష్ట్ర వీరశైవ లింగాయత్ చైర్మన్ వై. రుద్ర గౌడ్, రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారద, రాష్ట్ర శాప్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ మాచని వెంకటేష్, పట్టణ అధికార ప్రతినిధి సునీల్ కుమార్, మున్సిపల్ కోఆప్షన్ మెంబెర్ అబ్రార్, కౌన్సిలర్లు సుధాకర్,రాజారత్నం, ఇన్చార్జులు కోటకొండ నరసింహులు, రుద్రాక్షల బజారి, నాయకులు బి.ఎన్ నాగరాజ్, డిష్ రఫీ, మాధవ స్వామి,ఆదెన్న, ప్రభాకర్, రఘు, పేట శ్రీనివాస్ రెడ్డి,నరహరి రెడ్డి, షేక్ చాంద్ బాషా,మాల అశోక్ కుమార్,మాల కేశవ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమి గల్లంతు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం : రాష్ట్రంలో జరుగనున్న


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి

ఎన్నికల్లో చంద్రబాబు మాయా కూటమి గల్లంతు కావడం ఖాయమని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రిపై జరిగిన దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎంపై దాడిపై సమగ్ర విచారణ చేసి నేరస్తులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ఎన్ని దాడులు చేసిన వైసిపి ధైర్యంగా ఎదుర్కొ ంటుందని అన్నారు. ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి గల్లంతు కావడం ఖాయం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి, వైసిపి మండల ఇన్ చార్జ్ సి. వి. విశ్వనాథ్ రెడ్డి, మండల నాయకులు పెట్రోలు బంక్ శీనన్న, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గోనెగండ్ల : సిద్ధం బస్సు యాత్ర ద్వారా నిత్యం ప్రజల్లో ఉంటున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై దాడి హేయమైన చర్య అని వైయస్సార్ పార్టీ మండల


నిరసన తెలుపుతున్న వైకాపా నాయకులు

యువజన నాయకుడు టికె బందే నవాజ్ అన్నారు. మండల కేంద్రమైన గోనెగండ్ల లోని ఎంపీపీ కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డి గాయపడిన చిత్రాలతో దాడిని ఖండించి నిరసన తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ఇలాంటి దాడులకు దిగుతున్నారని వారు అన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ గోవిందు, కె పద్మనాభం, చికెన్ రాజా మాబు వలి పాల్గొన్నారు.

సిఎంపై రాళ్ల దాడి పిరికిపంద చర్య : ఎంపిపి, జడ్పిటిసి

ప్రజాశక్తి - కౌతాళం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై రాళ్లదాడి కూటమి పిరికిపంద చర్యకు పాల్పడిందని ఎంపీపీ అమ్రేష్, జడ్పిటిసి రాధా ప్రియ దర్శిని, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, కో ఆప్షన్ నెంబర్ మాబు సబ్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో చెన్నప్ప, బసవ ప్రభు, అబ్దుల్ సమద్, వడ్డే రాముడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అమ్రేష్


దర్గాను ముస్తాబు చేస్తున్న దర్గా సభ్యులు

నేడు గంజిహళ్లి బడేసాహెబ్ నెల ఉరుసు

- పలు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు మహాత్మా శ్రీ బడేసాహెబ్ తాత నెల ఉరుసు ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ధర్మకర్త ఆర్ కుబేరారెడ్డి దర్గా డెవల ప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ చిన్న ముద్గోల్,వంశ పారంపర్య పీఠాధి పతులు షేక్ హుస్సేన్ సాహెబ్ మదార్ సాహెబ్,ఖాసీం వలి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం మహాత్మా సద్గురు శ్రీ గంజిహళ్లి బడేసాహెబ్ బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టనున్నామని అన్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల నుంచి మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు కూచిపూడి నృత్య ప్రదర్శన,సంగీత విభావరి,జీవిత చరిత్ర ముఖ్య ఘట్టాలపై తత్వ సమేత కథా స్రవంతి, భజన భక్తి గీతాలు కీర్తనలు నిర్వహించనున్నామని అన్నారు. భక్తులు ప్రజలు ఇచ్చే విరాళాలతో ప్రతి గురువారం మరియు అమావాస్య రోజు ఉచిత అన్నదానంతో పాటు దర్గా డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై నెల ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

అంబేద్కర్ స్ఫూర్తితో ఉద్యమించాలి

అంబేద్కర్ జయంతోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో... చైతన్యవంతులై దళిత, గిరిజనులు హక్కుల కోసం సింహాలై గర్జించాలని డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు యస్.దేవసహాయం, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి డా. మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, కో కన్వీనర్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ, డా.బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్నలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పద్మశ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ హాల్ నందు డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ మాల ఉసేని అధ్యక్షతన అంబేద్కర్ జయంతోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, గిరిజనులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు రాజ్యాధికారం కోసం పోరాడాలన్నారు. అంతకంటే ముందుగా స్థానిక కలుగొట్ల రోడ్డు ఎం.బి.చర్చి దగ్గర ఆది ఆంధ్ర పాఠశాల నుండి పద్మశ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ హాల్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలోదప్పు కళాకారులు డప్పుల దరువు దళిత యువకులు ప్రదర్శించిన కర్ర సాము విన్యాసాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం డా.బి.ఆర్.అంబేద్కర్ నిలువెత్తు కాంస్య విగ్రహానికి ఉత్సవ కమిటీ నేతలు గజమాలతో పూలమాలంకరణ చేసి ఘనంగా నివాళు లర్పించారు. జయంతో త్సవ సభలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ డి. బాలయ్య, రుద్రాక్షల


సంఘీభావం తెలుపుతున్న దళిత నేతలు

పెద్దయ్య, సోగనూరు ఆనందరావు, రుద్రాక్షల బజారి, యస్.రాజు, కనకవీడు రాజు, రోజా ఆర్ట్స్ ఉసేని, ఎరుకల క్రిష్ణ, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కరుణాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి మహదేవ్ మాదిగ, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఎల్ఐసి భాస్కర్, బహుజన వ్యాసకర్త టీచర్ ఆరె కంటి భాస్కర్, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు దావీదు, తదితరులు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు


ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నేతల ఆర్థికసాయం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మాల వీధిలో అనారోగ్యంతో రామాంజనమ్మ అనే వృద్ధురాలు మరణించింది. సమాచారం తెలుసుకున్న మండల టిడిపి నాయ కులు బడి గింజల రంగన్న, తెలుగు యువత అధ్యక్షుడు రాజా సాబ్, నాయ కులు సుభాన్, రహమాన్ ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని బిఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఆఫీసర్ టీ సంజీవ్ కుమార్ కోరారు. ఆదివారం బిఎస్ఎన్ఎల్ ఆఫీసు ఆవరణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని తీర్చుందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెటిఓలు గోపినాథ్, హరినాథ్, శ్రీనివాసులు, ఎస్‌టిఆర్ సుదర్శన్ రావు, గురుమూర్తి, విజయకుమార్, కృష్ణ, మస్తాన్ వలి, మంజుల, శివ, లింగారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉద్యోగులు

టిడిపిని వీడి వైసిపిలోకి చేరిక

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన టిడిపి నియోజకవర్గ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి వర్గానికి చెందిన నాయకులు వైసిపి తీర్థం స్వీకరించారు. ఆదివారం వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో వైసిపి కండువా వేసుకున్నారు. 30 సంవత్సరాలుగా టిడిపిలో కొనసాగిన నాయకులు, కార్యకర్తలు జెట్టి నరసింహులు, పద్మనాభం, వీరేష్, చిన్న వీరేష్, నర్సయ్య, చిన్నారెడ్డి, వీరన్న, తాయన్న, రామిరెడ్డి, నరసింహులు, సుధాకర్, హనుమంతు, బొబ్బిలి, అసేని, రంగన్న వీరితో పాటు 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైసిపి లోకి చేరారు. పార్టీలోకి చేరిన వీరికి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి వైసిపి యువనేత వై. ప్రదీప్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి గెలుపు కోసం పని చేస్తామని పార్టీలోకి చేరిన నాయకులు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే, వైసిపి నేత కు శాలువ కప్పి, గజమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకోబా, రోగప్ప, రవి రెడ్డి, బొజ్జప్ప, శ్రీనివాసులు, నారయణ, నాగేష్, నర్సిరెడ్డి, రాము, రాజు వీరితో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



రాయి దాడిపై సిబిఐ విచారణ చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - నందవరం


మాట్లాడుతున్న గురురాజ్, ఖాసీం వలి

సిఎం జగన్‌పై రాయి దాడిపై రాజకీయాలు చేయకుండా వెంటనే సిబిఐ విచారణ చేయించాలని, అందుకు జగనన్న సిబిఐ విచారణ కోరాలని టిడిపి యువ నాయకులు గురురాజ్ దేశాయ్, కాశీంవలి, గడ్డం నారాయణ రెడ్డిలు అన్నారు. ఆదివారం దేశాయ్ నెట్వర్క్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత దృక్పథంతో సీఎం జగన్‌పై దాడిని ఖండిస్తున్నామని, దాడికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు మేలుకొని దమ్ము, ధైర్యం ఉంటే సిబిఐ విచారణ చేయించాలని, అందుకు టిడిపి, జనసేన పార్టీలు పూర్తిగా సహకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామన్న గౌడ్, వీరేష్, సత్యా రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

షాదిఖానాలను ఎమ్మెల్యే పట్టించుకోలేదు

- గుడిసె అది కృష్ణమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

షాది ఖానా పనులను ఐదు సంవత్సరాలలో ఒక్కసారి కూడా కన్నెత్తి చూడకపోవడం విచారకరమని, ఓట్లు దండుకొని ముస్లిం ఓటర్లను ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి బానిసలుగా చూస్తున్నారని మాజీ ఇంచార్జి గుడిసె అది కృష్ణమ్మ, ఆదోని నియోజకవర్గం ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఆరోపించారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ముహ్మద్ అలి పార్కు వద్ద షాదీఖానాను జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ మల్లప్పలతో కలిసి సందర్శించారు. పార్థసారథి మాట్లాడుతూ షాది ఖానా పనులను ఐదు సంవత్సరాలలో ఒక్కసారి కూడా కన్నెత్తి చూడకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని మండలం మాజీ ఎంపీపీ మురళి, శ్రీకాంత్ రెడ్డి, ఆదోని పట్టణం ముస్లిం మైనార్టీ నాయకుడు సాదిక్ వలి, జనసేన పార్టీ నాయకులు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు



ఎన్నికల సమాచారానికి సంప్రదించండి : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏదేని ఎన్నికల సమాచారం కావాలంటే రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి టి. రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయ వెనుక భాగంలో 139-నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అత్యవసర పోలీస్ సేవలకు 08514-225097కు డయల్ చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల జిల్లాలో అత్యవసర పోలీస్ సేవలకు ఎక్కడైనా అల్లర్లు, గొడవలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగినా, ఏదైనా ప్రమాదంలో ఉన్నా వెంటనే 08514-225097 నంబర్‌కు డయల్ చేయాలని జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పోలీస్ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటూ సత్వర పోలీస్ సేవలు అందిస్తారని తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి రథోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం గ్రామంలో చౌడేశ్వరి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆరవ రోజు ఆదివారం రథోత్సవం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని లాగి ఉత్సవంలో పాల్గొన్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

నాడు కోడికత్తి.. నేడు గులకరాయి డ్రామా : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాడు కోడి కత్తి, నేడు గులకరాయి డ్రామా ఆడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని పంచముపేటలో టిడిపి ఆధ్వర్యంలో ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు కోడికత్తి డ్రామా, గొడ్డలి వేటు కుట్ర, నేడు గులకరాయి డ్రామాలు జగన్ మోహన్ రెడ్డి ఆడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు రాగానే జగన్ రెడ్డి ముఠా ఓట్ల కోసం సింపతీ డ్రామాలు మొదలు పెడుతుందన్నారు. ఈ డ్రామాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, వార్డు మెంబర్లు లాయర్ నాగేంద్ర రెడ్డి, టిప్ టాప్ కలాం, రజాక్, నాయకులు రాయలసీమ సలాం, అల్తా హుస్సేన్, ఖాదర్ భాషా, సయ్యద్ హుస్సేన్, మహమ్మద్ హుస్సేన్, కార్పెంటర్ షబ్బీర్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరు చరితా రెడ్డి విస్తృత ప్రచారం

పాణ్యం : సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యంనియోజక వర్గంలో టిడిపి గెలుపే ధ్యేయంగా టిడిపి అభ్యర్థి గౌరు చరిత ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఉదయం తమ్మారాజుపల్లె, పిన్నాపురం, సాయంకాలం గోరుకల్, కొండ జూటూరు గ్రామాలలో టిడిపి పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేపట్టారు. ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓటు వేసి టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు జయ రామి రెడ్డి, లాయర్ బాబు, రంగ రమేష్, ఇప్ప సుధాకర్, దుబాయ్ శీను, సురేష్ బాబు, రాం పుల్లారెడ్డి, గంగ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి


ఓబులంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఓబులంపల్లెలో ఎన్నికల ప్రచారంలో గౌరు రామకష్ణారెడ్డి

ఆళ్లగడ్డ : టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఓబులంపల్లె నాయకులు గౌరు రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఓబులంపల్లి గ్రామంలో టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులతో కలిపి పలు వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియను అఖండ మెజారిటీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు పెండేకంటి శంకరయ్య, హుస్సేన్ భాష, సుబ్బారెడ్డి, మౌలాలి తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి : సిఐ

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ చంద్రబాబు, ఎస్సై నిరంజన్ రెడ్డిలు తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్నకంబలూరు ,డి కొట్టాల పెద్ద కంబలూరు ,గోనం పల్లె, అప్పనపల్లి గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ చంద్రబాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు 2024 సాధారణ ఎన్నికల సందర్భంగాఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలంతా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకొనే విధంగా భరోసా కల్పించేందుకు స్టేషన్ సిబ్బంది, సిపిపిఎఫ్,(బిఎస్ఎఫ్) బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎంతమంది కలిసొచ్చినా

ఫ్యాన్ ముందు కొట్టుకుపోవాల్సిందే..

- నంద్యాల వైసిపి అభ్యర్థి శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎన్ని కూటములు కలిసి వచ్చినా ఫ్యాన్ ప్రభంజనం ముందు కొట్టుకుపోవాల్సిందేనని నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 2, 5వ వార్డులలో కౌన్సిలర్లు సాదిక్ బాషా, ఆరిఫ్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మాజీ పిఎస్‌సి మెంబర్ డా.నౌమాన్, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరించారు.నంద్యాల ఎమ్మెల్యే, ఎంపీ వైసిపి అభ్యర్థులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిలకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, అధ్యక్షులు పడగండ్ల సుబ్రహ్మణ్యం, జాకీర్ హుస్సేన్, జెసిఎస్ కన్వీనర్లు సలాం ముల్లా, దాల్మిల్ అమీర్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, ముస్లిం మైనారిటీ సెక్రటరీ ఫైలెట్, 2, 5వ వార్డు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్ : మరింత అభివృద్ధి చేయడానికి మరొకసారి అవకాశం ఇవ్వాలని వైసిపి అభ్యర్థి నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవిరెడ్డి ప్రజలను అభ్యర్థించారు. ఆదివారం నంద్యాల మండలం పుసులూరు బ్రాహ్మణపల్లె గ్రామాలలో వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, పోచ జనార్దన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమూల్యమైన ఓటును ఫ్యాను గుర్తుపై వేసి వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ పుష్పావతి, మాజీ వైస్ ఎంపీపీ అడ్వకేట్ కృష్ణారెడ్డి, ప్రద్యున్నారెడ్డి, తేజ రెడ్డి, రామసుబ్బయ్య, సుధాకర్ రెడ్డి, పుల్లయ్య, సురేంద్ర, భూపాల్, రవిరెడ్డి, హుస్సేన్ రెడ్డి, రవి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు, ఆళ్లగడ్డ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం ఉయ్యాలవాడ మండలంలోని పెద్దయమ్మనురు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమకు ఓటు వేసి గెలిపించాలని వారు అభ్యర్థించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన దాడిని వారు ఖండించారు.

బనగానపల్లె : సంక్షేమం, అభివృద్ధి కోసం వైసీపీని మరోసారి గెలిపించాలని మండలంలోని రామతీర్థం గ్రామం నుంచి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మండలంలోని రామతీర్థం, నందివర్గం,బీరవోలు, చేర్వుపల్లె గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. మే 13న జరుగబోయే ఎన్నికల్లో బనగానపల్లె వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రామిరెడ్డిని, నంద్యాల పార్లమెంటు అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి ఫ్యాన్ గుర్తు కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైసిపి మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి,జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రాం మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు సన్నల జనార్దన్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి : వైసిపితోనే నిరంతరం సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందని, ఎన్నికల్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డిని, నంద్యాల ఎంపి అభ్యర్థి పోచా బ్రహ్మానందారెడ్డిని గెలిపించాలని గంగుల సారికారెడ్డి, గంగుల అవంతికారెడ్డిలు కోరారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి,ఆవులపల్లె గ్రామాలలో గంగుల సారికారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నియోజకవర్గ ఎమ్మెల్యే, నంద్యాల ఎంపి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, సర్పంచ్‌లు మహేశ్వరి, ప్రతాపరెడ్డి, గోవిందయ్య, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రమణ, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వైసీపీ నాయకులు సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హరినాధరెడ్డి, జయరామిరెడ్డి, బాబు, వెంకటన్న, రవి, రమణ, నాగేశ్వరరావు యాదవ్, శంకర్‌రెడ్డి, గుండుసాబ్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేతంచర్ల : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గెలుపు కోసం మంత్రి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి ఆదివారం బేతంచెర్లలోని 3వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అర్జున్ రెడ్డి ఓటర్లను కలుసుకొని ఎన్నికల్లో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి, ఎంపీ పోచా బ్రహ్మానందం రెడ్డికి ఫ్యాను గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బేతంచర్ల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, వైసిపి నాయకులు గూని నాగరాజు, బుగ్గన రమణారెడ్డి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్లు చింతా నాగిరెడ్డి, ప్లాట్ల దస్తగిరి, బుగ్గన భాస్కర్ రెడ్డి, సలీం, కాజా, జస్వంత్ రెడ్డి, నిరంజన్, సుల్తాన్, సచివాలయాల టౌన్ కన్వీనర్లు ఆజాం భాష, ఖాజా హుస్సేన్, డక్కి శేఖర్, తలారి మల్లికార్జున, తిరుమలేష్, పాణ్యం రామ్మోహన్ రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, నవీన్ సాయి, మనీ వర్ధన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామంలో నందికొట్కూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ధార సుధీర్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మండల కన్వీనర్, సర్పంచ్ రవి యాదవ్, ఎంపీపీ మురళిక్రిష్ణారెడ్డి,సొసైటీ చైర్మన్‌లు మద్దూరు సతీష్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పబ్బతి రవి, జెసిఎస్ మండల కన్వీనర్ ఓంకార్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా ల మైనారిటీ సెల్ రీజినల్ కో ఆరినేటర్ అబుబక్కర్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు సురేష్ యాదవ్, జెసిఎస్ తాలుకా కన్వినర్ అశోక్ రెడ్డి, కౌన్సిలర్ చిన్నరాజు, మార్కెట్ రాజు,శివారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, కాంతారెడ్డి, ఎంపీటీసీలు సురేష్, నాగేశ్వరరావు, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి


బనగానపల్లె : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


బేతంచెర్ల : ప్రచారం నిర్వహిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి


ఆళ్లగడ్డ : ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గంగుల, ఎంపీ పోచా

అంబేద్కర్ ఆశయాలు ఆదర్శం



అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న తిక్కారెడ్డి తదితరులు

ప్రజాశక్తి - విలేకరులు

మంత్రాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ప్రజా ప్రతినిధులు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, మండల కార్యదర్శి అంజి, జైభీమ్ యంఆర్పియస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ, నవ్యాంధ్ర ఎమ్మార్పిఎస్ నియోజకవర్గ ఇంచార్జీ దేవపుత్ర, ఎంఆర్పిఎస్ నాయకులు కయ్యూన్‌ల నేతృత్వంలో తమ వర్గాలతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆస్పరి :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఆలూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి, బళ్లారి మాజీ మేయర్ శశికళ కృష్ణమోహన్‌లు అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆస్పరి చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపిటీసీలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జడ్పిటిసి దొరబాబు,ే డిసిసీ బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర,వైసిపి నాయకులు పాండు, మహానంది,సుదర్శన్,ఎల్లప్ప, లక్ష్మీనారాయణ, తిమ్మప్ప, ప్రకాష్,వసంత,రాజశేఖర్‌లు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంజప్ప ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుండి చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ రామాంజనేయులు, సంజప్ప,సతీష్,మ్యారేజ్, శ్రీను పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బి విజయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసిడాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి నివాళు లర్పించారు. **సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో** అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు పి. గోవిందు, బి. రాముడు, రైతు సంఘం అధ్యక్షులు ఎం. అబ్దుల్లా మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలు మర్చిపోలేమని ఆయన సేవలను కొనియాడారు. **చిప్పగిరి:** హక్కుల గురించి వివరించిన మహనీయుడు అంబేద్కర్ అని వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి, వైసీపీ కన్వీనర్ మారయ్య, ఆలూరు కాంగ్రెస్ ఇంచార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ, సర్పంచు గోవిందరాజులు తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా విరుపాక్షి, మారయ్య పూలమాల వేసి నివాళు లర్పించారు. మండల కేంద్రంలో ఆలూరు కాంగ్రెస్ ఇంచార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీ నుంచి అంబేద్కర్ కటౌట్‌ను ఊరేగింపుగా స్థానిక బస్టాండ్ దగ్గర వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకే తీసుకెళ్లాలని అన్నారు. చిప్పగిరి అంబేద్కర్ సాధన సమితి యువత పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేశారు. నేమకల్లు గ్రామంలో సర్పంచ్ ప్రేమ్ కుమార్, వైసిపి కోకోన్వీనర్ సత్తిరెడ్డి, ఎంపీటీసీ సుంకన్న, అంబేద్కర్ సాధన సమితి సభ్యులు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. **ఆదోని:** రాజ్యాంగాన్ని మార్చే దిశగా బిజెపి కుట్రలను ప్రతి ఒక్కరూ ఎదుర్కోవాలని సిఐటియు సీనియర్ నాయకులు ఈరన్న, మహానంద రెడ్డి పేర్కొన్నారు. సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ పట్టణ ఉపాధ్యక్షులు వి విజయ్ అధ్యక్షతన అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి సిఐటి యు పట్టణ సీనియర్ నాయకులు ఈరన్న, మహానంద రెడ్డి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి నాగేంద్ర మాజీ జిల్లా నాయకులు పి.ఎస్.గోపాల్, డి.లక్ష్మన్న సిఐటియు పట్టణ అధ్యక్షులు బి తిప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే లింగన్న, కెవిఎస్ పట్టణ నాయకులు డి కృష్ణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దళితులు, హమాలీలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. **టిడిపి ఆధ్వర్యంలో ...** ఆదోని పట్టణంలో టిడిపి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో బైకు ర్యాలీగా వెళ్లి ఆదోనిలోని అంబేద్కర్ నగర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారని కొనియడారు. నాయకులు బుద్ధారెడ్డి లక్ష్మీనారాయణ తిమ్మప్ప శ్రీనివాస ఆచారి జగదీష్ బాలాజీ, అంజి, కృష్ణారెడ్డి చిట్టిబాబు నరసింహులు జయరాము అభిమానులు పాల్గొన్నారు. **ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో..** ఆదోని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీగా వచ్చి పూలమాలతో నివాళులర్పించారు నాయకులు బండారి హనుమంతు, బండారి గిడ్డయ్య, వీరేష్, బాలస్వామి తిమ్మప్ప పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **నందవరం :** ప్రతి ఒక్కరు బిఆర్ అంబేద్కర్ ఆశయాల కోసం కృషి చేయాలని దేశాయి నెట్వర్క్ అధినేత గురురాజ్ దేశాయి, టిడిపి నాయకులు గడ్డం నారాయణరెడ్డి, ఖాసీం వలిలు అన్నారు. దేశాయ్ నెట్వర్క్ కార్యాలయంలో అంబేద్కర్ 133 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో దేశ నెట్వర్క్ సభ్యులు రామన్న గౌడ్, శివ, వాజిద్, వీరేష్, పాండు, ఏలీయా, టిడిపి నాయకులు వీరేష్, సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పరి : అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న విరుపాక్షి

జెవివి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం : చిప్పగిరి: అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు శిబిరానికి విశేష స్పందన లభించిందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్ తెలిపారు. ఆదివారం నగర డోన్ గ్రామంలో నగర డోన్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 55 మంది యువకులు రక్తదానం చేశారు. అలాగే అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు రాయుడు, విజయ్, రాజు, రమేష్, కన్నప్ప, గ్రామ పెద్దలు శీతప్ప రెడ్డి, లింగారెడ్డి, పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పెద్దకడబూరు మండలంలో..** అంబేద్కర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దకడబూరు, చిన్నతుంభళం గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దాస్, నాయకులు ఆశీర్వాదము, ఎంఆర్పిఎస్ నాయకులు తిప్పన్న, ఆదాము,యోహాను కాంగ్రెస్ నాయకులు ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు. **దేవన కొండ మండలంలో** తెర్నేకల్ గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ అరుణ్ కుమార్ సత్యరాజు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. కుంకనూరు, దేవనకొండ గ్రామాల్లో ఎమ్మార్పీ ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించి ఆయా గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. **కౌతాళంలో** జై భీమ్, ఎమ్మార్పీఎస్, దళిత సమాఖ్య వివిధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వైఎస్ఆర్సిపి నాయకులు సీతారాం రెడ్డి భార్య గిరిజమ్మ, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, సర్పంచ్ పాల్ దినకరన్, మాజీ సర్పంచ్ అవతారం, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, అబ్దుల్ సమద్, వడ్డే రాముడు, దళిత సమైక్య నాయకులు భాష, ప్రకాష్, మారెప్ప, నాగరాజు, రాజబాబు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని పూల మాలలు వేశారు. **హోళగుంద** మండలంలో అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ



నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు



నివాళులర్పిస్తున్న నాయకులు



అంబేదర్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకుకులు



అంబేద్కర్ చిత్రపటానికి వేసి నివాళి అర్పించిన సబ్ కలెక్టర్

అంబేద్కర్ ఆశయాలను నెరవేరుద్దాం

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు నెరవేరే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి మహో త్సవం పురస్కరించుకొని ఆదివారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అవకాశాలను రాజ్యాంగ ప్రకారం దేశంలో ప్రజలందరికీ చేరాలన్నారు. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అందరిని భాగస్వామ్యం చేద్దామన్నారు. కార్యాల యపు పరిపాలన అధికారి సి ఆర్ శేషయ్య, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఉప తాసిల్దార్ వినీత్, సీనియర్ సహాయకులు రామచంద్ర, లక్ష్మయ్య, వీఆర్వోలు ఉన్నారు.

మళ్లీ అవకాశం ఇవ్వండి : వైసిపి

ప్రజాశక్తి - కౌతాళం



ప్రచారం చేస్తున్న నేతలు

మంత్రాలయం ఎమ్మెల్యే వై బాల నాగి రెడ్డిను మరోసారి అత్యధిక మె జార్టీతో గెలిపిద్దామని టీటీడీ పాలకమండలి సభ్యులు సీతారాం రెడ్డి, సతీమణి గిరిజమ్మ, వై బాలనాగరెడ్డి కుమార్తె ప్రియాంక రెడ్డి, వీణ, అనుష కోరారు. ఆదివారం మండల పరిధిలోని హాల్వి, మురళి, గుడి కంబాలి, వల్లూరు గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంత్రాలయం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపగడపకు అందేలా కృషి చేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు మళ్లీ ప్రజలకు అందాలంటే వైసిపిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమ ంలో కన్వీనర్ దేశాయి ప్రహ్లాదచారి, ఎంపీపీ అమ్రేష్, జడ్పిటిసి రాధా ప్రియ దర్శిని, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, కో ఆప్షన్ నెంబర్ మాబు సబ్, చెన్నప్ప, బసవ ప్రభు, సిద్ధన్న గౌడ్, సాదిక్, పంప మరి గౌడ్ బసప్ప గౌడ్, సోమశేఖర్ గౌడ్, పాల్ దినకరన్, వడ్డే రాముడు, పాండురంగ రెడ్డి, సోమిరెడ్డి, మల్లికా ర్జున రెడ్డి నాగభూషణ్ గౌడ్, అనిల్, బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరులో .. వైసీపీ రాష్ట్ర యువజన నాయకులు వై ప్రదీప్ రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో జోరు ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని నౌలేకల్, మేకడోణ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల నుంచి లబ్ధి పొంది ఉంటే ఫ్యాన్ గుర్తు ఓటు వెయ్యాలని అభ్యర్థిం చారు. బాలనాగిరెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి నాలుగో సారి అసెంబ్లీకి పంపుదామని తెలిపారు. కార్యక్రమంలో నౌలేకల్ పల్లవి నరేష్, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి,మాజీ ఎంపీపీ రఘురాం, విజయేంద్ర రెడ్డి, నరవ రాజశేఖర్ రెడ్డి గజేంద్రరెడ్డి, పూజారి ఈరన్న,ముక్కరన్న, అర్లప్ప, శాంతిరాజు, అనుమప్ప, నాగరాజు, వెంకటేష్, అంజినయ్య,శరణప్ప, మేకడోణ షేర్ ఖాన్ పటేల్, నారాయణ స్వామి, సుందరరాజు, తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ప్రదీప్ రెడ్డి

వైసిపితోనే సంక్షేమం : విరుపాక్షి

ప్రజాశక్తి- దేవనకొండ :



వృద్ధురాలితో మాట్లాడుతున్న విరుపాక్షి

మరోసారి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఆలూరు నియోజ కవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి అన్నారు. మండలంలోని సింగాపురం, పొట్లపాడు,కొత్తపేట, పుల్లాపురం గ్రామాల్లో ఎన్నికల పరిశీలకుడు తెర్నేకల్ సురేంద్ర రెడ్డితో కలసి ఆయన ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం చేసి ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని బేతపల్లి,చెల్లెల చెలిమల, పల్లె దొడ్డి,కే.వెంకటాపురం నుండి 200 టిడిపి కుటుంబాలు వైసిపి పార్టీలోకి చేరాయి. నాయకులు శశికళ, ప్రభాకర్ రెడ్డి, కొత్త కాపు మధుసూదన్ రెడ్డి, నిజాలు రెడ్డి,హర్షవర్ధన్ రెడ్డి, ప్రేమనాథ్ రెడ్డి,నారాయణరెడ్డి, తపాల శ్రీనివాసులు, దివాకర్ నాయుడు, లుముంబా, సర్పంచులు సోమశేఖర్ రెడ్డి, మల్లయ్య, కొత్తపేట బాబు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర భవిషత్తు : బి.వీరభద్రగౌడ్

ప్రజాశక్తి-హాలహర్వి



నాయకులతో వీరభద్రగౌడ్

సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి టిడిపి అధికారం చేపడితేనే రాష్ట్రానికి భవిషత్తు ఉంటుందని ఆలూరు టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం మండలపరిధిలోని బిలేహాల్, విరుపాపురం, కుళ్ళల్లి, నిట్రవట్టి, హాలహర్వి, మాచనూరు గ్రామంలో ఆలూరు టిడిపి అభ్యర్థి బి. వీరభద్ర గౌడ్, టిడిపి మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బి.వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నిట్రవట్టి గ్రామంలో జెడ్పీటీసీ లింగప్ప వారితో పాటు 50 కుటుంబాలకు కండువవేసి తెదేపాలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో హాలహర్వి మండల కన్వీనర్ సుధాకర్ పాల్ రెడ్డి,గుండయ స్వామి, హాలహర్వి సర్పంచ్ మల్లికార్జున, లక్ష్మన్న, సదాశివ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశ్య పూర్వకంగానే సిఎంపై దాడి : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

ఇది ఉద్దేశపూర్వకంగా చేయించుకున్న దాడేనని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి, టీడీపీ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె అది క్రిష్ణమ్మ, మాజీ ఛైర్మన్ దేవేంద్రప్ప, జనసేన ఇంచార్జ్ మల్లప్ప ఆరోపించారు. ఆదివారం ఆదోని పట్టణంలో ప్రచారంలో భాగంగా వారు మాట్లాడారు.డ్రామాలు నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్న విషయాన్ని జగన్ గుర్తించాలని అన్నారు.

ఆధిపత్య సమాజపు ధిక్కారస్వరమే అంబేద్కర్



కెజిబివి విద్యార్థి నిర్మలను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

నిర్మలను స్ఫూర్తిగా తీసుకోవాలి

కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఇటీవల ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన నిర్మలను విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన నిర్మల 10వ తరగతిలో మంచి మార్కులు సాధించినప్పటికీ, పేదరికంతో తల్లిదండ్రులు చదువు మాన్పించారని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్మలను ఆస్పరి మండలం కెజిబివి కళాశాలలో అడ్మిషన్ చేయించారు. నిర్మల ఇంటర్మీడియట్ బైపిసి మొదటి సంవత్సరం 440 మార్కులకు 421 మార్కులు సాధించి జిల్లాలో టాపర్ గా నిలిచింది. జిల్లా కలెక్టర్ ఆదివారం నిర్మలను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు. బేటి బచావో బేటి పడావో కింద నిర్మలకు ఇన్సెంటివ్ ఇవ్వాలని కలెక్టర్ ఇంచార్జ్ ఐసిడిఎస్ పిడి అధికారిని ఆదేశించారు. కలెక్టర్ నిర్మలను శాలువాతో సన్మానించి స్వీట్స్ అందచేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, సర్వ శిక్ష అభియాన్ ఎపిసి విజయజ్యోతి, ఇన్‌చార్జి ఐసిడిఎస్ పిడి వెంకట లక్ష్మమ్మ, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్‌సునీత, కెజిబివి ప్రిన్సిపల్ శరన్ స్మైలీ, ఆదోని ఎంఇఒ-2 శ్రీనివాసులు, విద్యార్థిని తల్లి, బంధువులు పాల్గొన్నారు..

టిడిపి ఎన్నికల సమన్వయకర్తల నియామకం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రానున్న ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సమన్వయకర్తలను అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ అధిష్టానం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో భాగంగా కర్నూలు పార్లమెంట్కు జిల్లా అధ్యక్షుడు బిటి నాయుడు, నంద్యాల నియోజకవర్గానికి ఏరాసు ప్రతాపరెడ్డి, కోడుమూరు, ఎమ్మిగనూరుకు సంజీవ్ కుమార్ను నియమించింది. ఆలూరు, పత్తికొండలకు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆళ్లగడ్డకు కేవీ సుబ్బారెడ్డిని నియమించారు.



కవితను వినిపిస్తున్న హసీనా ,వేదికపై రఘుబాబు, ఆవులబసప్ప,తదితరులు

రాజ్యాంగ రక్షణే దేశానికి రక్ష

-సాహితీస్రవంతి జనకవనంలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

రాజ్యాంగాన్ని రక్షించుకోవడమంటే దేశాన్ని రక్షించుకోవడమేనని వక్తలు అన్నారు. సాహితీస్రవంతి జిల్లాకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నగరంలోని లలితకళాసమితిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా జనకవనం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప ఆధ్వర్యంలో జరిగిన సభలో రాష్ట్రకార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ దేశంలో అనిశ్చితి, అసహనాలు కొనసాగుతున్న దని రాజ్యాంగం పట్ల గౌరవంలేకుండా మార్చాలని చూస్తున్నా రన్నారు. ప్రజల్లో దీనివల్ల అభద్రతా భావం మొదలైందన్నారు. ఈనేపథ్యంలో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అవసరముందన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఎంపి బసవరాజు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయపథంలో ప్రతి పౌరుడు నడవగలిగినపుడే రాజ్యాంగానికి రక్ష అన్నారు. అనంతరం జరిగిన జనకవనంలో కవులు సయ్యద్ జహీర్ అహ్మద్ , తలారి శివాంజనేయులు, డి.పార్వతయ్య, డాక్టర్ వి.పోతన్న, మండ్ల శేఖర్ , హసీనా, నిసార్ అహ్మద్ , కవితలు వినిపించారు. సభలో రచయితలు నాగేశ్వరాచారి, చౌశా, మారుతీ పౌరోహితం, ఎస్‌డివి అజీజ్, ఎం.ఉరుకుందు పాల్గొన్నారు. సభలో నంది అవార్డుగ్రహీత మహమ్మద్ మియా సామాజిక చైతన్య గీతాలు ఆలపించారు.

ఎద్దుల బండిపై అంబేద్కర్ చిత్రపటంతో ప్రదర్శన

సామాజిక న్యాయం కోసం కెవిపిఎస్ ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని జోహరాపురంలో ఎద్దుల బండిపై అంబేద్కర్ నిలువెత్తు చిత్రపటాన్ని పెట్టుకుని వీధి వీధినా సామాజిక హక్కుల ప్రదర్శనను నిర్వహించారు. ప్రదర్శనకు ముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఐదు కిలోల కేక్ కట్ చేసి ప్రజలందరికి బాబాసాహెబ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కెవిపిఎస్ నగర అధ్యక్షులు ఆర్.రమణ అధ్యక్షతన జరిగిన ప్రదర్శనకు సెక్యులర్ ఫోరం నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, మాజీ జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, నగర ఉపాధ్యక్షులు ఎం విజయ రామాంజనేయులు, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఏ గురు స్వామి మాట్లాడారు. జోహరాపురం లోని పెద్ద గేరి ఆటో స్టాండ్ వద్ద ప్రారంభమైన ప్రదర్శన మాలగేరి, తప్పెటగేరి, క్రింది ఆటో స్టాండ్ ల మీదుగా వీధి వీధినా తిరుగుతూ ప్రజలలో చైతన్యం నింపింది. వీధి కూడళ్లలో జరిగిన సభలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కుల వ్యవస్థను జటిలం చేసి, దోపిడీని కొనసాగించిన ఆధిపత్య సమాజపు దిక్కార స్వరమే అంబేద్కర్ అని వారు కొనియాడారు. భారత సమాజంలో పుట్టే ఏ మనిషి సమానం కాదన్న వ్యవస్థను బద్దలు కొట్టి మనుషులంతా సమానమేనని అన్న రాజ్యాంగాన్ని మన ముందుంచిన ఘనుడు అంబేద్కరన్నారు. రాణుల గర్భం నుండి పుట్టే పాలకుల స్థానాన్ని మార్చి మనిషి ఓటు ద్వారా ఎన్నుకునే మహత్తర అవకాశాన్ని కల్పించారన్నారు. ఆ ఓటును సైతం డబ్బు, కులం, చదువులను బట్టి ఉండాలన్న వాదనను త్రిప్పి కొట్టి. ఆలోచన చేయగల ప్రతి వయోజనుడికి ఓటు హక్కును కల్పించారన్నారు. కుటుంబాన్ని, పిల్లలను, చదువును, ఆరోగ్యాన్ని, ఆకలిని త్యాగం చేసి తీసుకువచ్చిన లౌకిక రాజ్యాంగాన్ని, అందులోని హక్కులను నేటి పాలకులు తుంగలో తొక్కుతూ తిరిగి మతజాడ్యాన్ని పెంచి, మనువాదపు కాలానికి నెట్టేసే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. రాజ్యాంగం ప్రకారం అందరికీ గర్వంగా జీవించే అవకాశం కల్పించాల్సిన పాలకులు, ఉన్న ఉపాధులను కాలదన్నుతూ, ఉద్యోగాలు ఇచ్చే ప్రభుత్వ రంగాన్ని అమ్ముకుంటూ ప్రజలను బిచ్చగాళ్ళుగా మారుస్తున్నారన్నారు. ప్రజా కంటకులుగా ఉన్న వారిని ఓటు అనే ఆయుధం ద్వారా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జయంతి ప్రదర్శన సభల కార్యక్రమంలో నాయకులు డి రంగస్వామి, సి నాగరాజు, దాసు, వేనమ్మ, విజయమ్మ, మధు, మౌలాలి, సుధాకర్, మహమూద్, తిప్పన్న, మాసూమ్, సామ్సన్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఎద్దుల బండిపై అంబేద్కర్ చిత్రపటంతో సామాజిక న్యాయం కోసం కెవిపిఎస్ ప్రచారం



అంబేద్కర్ జయంతి కేక్ కట్ చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

విద్యార్థులకు క్రీడా సాధన అవసరం

తైక్వాండో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ శంకర శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలంటే చిన్నతనం నుంచే వారు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మండపంలో కరాటే శిక్షకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని తెలియజేస్తూ వారికి ఆపిల్ పండ్లను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రతిరోజూ ఒక ఆపిల్ పండు తినడం వల్ల డాక్టర్ వద్దకు వెళ్లే అవసరం లేకుండా ఉండవచ్చు అని చెప్పారు. ఆపిల్ పండులో మంచి పోషక విలువలు ఉన్నాయని దీనిని తినడం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు కూడా దూరంగా ఉండవచ్చని చెప్పారు. విద్యార్థులను చిన్నతనం నుంచి క్రీడల్లో ప్రోత్సహించడం వల్ల వారిలో క్రమశిక్షణ, అంకితభావం పెంపొంది దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదుగుతారన్నారు.కర్నూలు నగరంలో క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని చెప్పారు. విద్యార్థులు కూడా వేసవి సెలవులను క్రీడలలో సాధన చేయడం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శంకర్ శర్మ సూచించారు.



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర శర్మ

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ : ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌పై దాడికి వైసిపి శ్రేణుల నిరసన

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని టిడిపి దాని మిత్రపక్షాలు ఖూనీ చేస్తున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపించారు. ఆదివారం బనగానపల్లె అవుకు మెట్ట వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు సిఎం జగన్మోహన్ రెడ్డి మీద రాయితో దాడి చేసిన సంఘటనకు నిరసనగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని 40 సంవత్సరాల చరిత్ర కలిగిన చంద్రబాబు నాయుడు తన అనునాయాలతో దాడి చేయించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. మే 13న ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతారని, జూన్ 4న టిడిపి పునాదులు కదిలించే రోజని తెలిపారు. జడ్పిటిసి సుబ్బులక్షమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, వైసిపి నాయకులు అబ్దుల్ ఫైజ్, కమ్మరి సురేష్ కుమార్, సైకిల్ షాప్ మహబూబ్ వలి, నారాయణ, గౌడ కంబగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు. **రుద్రవరం :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ రుద్రవరంలోని అమ్మవారి శాల సెంటర్లో వైసిపి నాయకుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దొంగ చాటుగా రాళ్లతో దా డి చేయించడం పిరికి పంద చర్యగా అభివర్ణించారు. వైఎస్‌ఆర్‌పి మండల అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, మండల సచివాలయ అధ్యక్షులు పాణ్యం నాగేష్, నాయకులు కోటకొండ సర్పంచ్ డేగాని వెంకటేష్, కొల్లం పుల్లయ్య, కేసీ నరసింహులు, బాబు, లింగం దిన్నె హరి నారాయణ, జయరాముడు, కోటకొండ పవన్ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :**సిఎం జగన్మోహన్ రెడ్డి పై రాయితో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాయి దాడి ఘటన నిరసిస్తూ నల్ల రిబ్బన్లతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నందికొట్కూరు అభ్యర్థి డాక్టర్ దార సుధీర్, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానంద రెడ్డిలను గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, యువ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి, పట్టణ అధ్యక్షులు మన్సూర్, పట్టణ ఉపాధ్యక్షులు ఉపేంద్ర రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, మాజీ కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ జబ్బార్, అడ్వకేట్ సి.విజయ్ కుమార్, బద్దుల శ్రీకాంత్, కౌన్సిలర్ లు చాంద్ భాష, షేక్ నాయబ్, కాటెపోగు చిన్నరాజు, అబ్దుల్ రవూఫ్,ఆర్ట్ శ్రీను, బొల్లెద్దుల రామక్రిష్ణ, పట్టణ యూత్ వింగ్ ప్రెసిడెంట్ అడ్డూ, పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :**సిఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని నంద్యాల వైసిపి సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాసిం పేర్కొన్నారు. నంద్యాల మండలం కానాల, నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్టాండు సెంటర్లో వైసిపి సోషల్ మీడియా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ మండలంలోని బత్తులూరు గ్రామంలో తాలూకా వైకాపా నాయకులు భూమా కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో నిరసన నిర్వహించారు.



బనగానపల్లె ఎమ్మెల్యే రామిరెడ్డి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో వైసిపి నిరసన